పశ్చిమాన 'మిచాంగ్' ముసురు

మార్కాపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెంతోపాటు దర్శి నియోజకవర్గాల్లో ముసురు పట్టింది. సోమవారం చిరుజల్లులు, అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. చలిగాలులు కూడా వీస్తుండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రబీలో సాగుచేసే పంటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తర్లుపాడు: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అబ్దుల్ హమీద్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తుఫాన్ సహాయక పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక బృందం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విద్యుత్ సమస్యపై సమాచారమివ్వండి : విద్యుత్ ఏఈ

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులకు స్తంభాలు కూలినా, తీగలు తెగిపడినా వెంటనే సమాచారం అందించాలని విద్యుత్ శాఖ ఏఈ హనుమా నాయక్ తెలిపారు. వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని సూచించారు.



గిద్దలూరు: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

గిద్దలూరు రూరల్: తుఫాన్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ డి.సీతారామయ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తుఫాన్ కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఎస్సై అజిత, ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, ఏఓ విజయభాస్కరరెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



తర్లుపాడులో అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ అబ్దుల్ హమీద్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

తాళ్లూరు (ముండ్లమూరు): తుఫాన్ ప్రభావంతో కోత దశలో పంట ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం, తాళ్లూరు, విఠలాపురం, శివరామపురం, కొర్రపాటివారిపాలెం, మాధవరం గ్రామాల్లో సోమవారం వరి, మొక్కజొన్న, మిరప పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు కోత కోసిన పంట, కోతకు సిద్ధంగా ఉన్న దెబ్బ తినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ప్రధానంగా తడిసిన ధాన్యం మొలకెత్త కుండా ఉండేందుకు గాను 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కోత దశలో ఉన్న పంట పొలంలో నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో విస్తృతంగా గాలులు వీస్తాయన్నారు. వర్షపాతం కూడా అధికంగా ఉంటుందన్నారు. వీలైనంత వరకు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. పల్లపు పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది నిత్యం గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, వీఏఏలు నాగరాజునాయక్, వెంకటరావు, రైతులు ఉన్నారు.

రాచర్ల: తుఫాన్‌తో రైతులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని సత్యవోలు, సోమిదేవిపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం తుఫాన్ ఉన్నందున రైతులు తగు జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. వచ్చే రెండు రోజుల్లో వరి కోతలు కోయకూడదని సూచించారు. అధిక వర్షం కరిసి పొలాల్లో నీరు చేరితే వెంటనే కాలువల ద్వారా వర్షపు నీటిని బయటకు పంపించాలని తెలిపారు. గాలి, వానకు పడిపోయిన వరిని దుగ్గులను తీసి నిలబెట్టి కట్టలుగా కట్టాలని చెప్పారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన మిరప, వరి పంటలను మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా మిరప పొలాల్లో నీరు నిలబడకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. మండలంలో 3 వేల ఎకరాల్లో మిరప, సుమారు 3 వేల ఎకరాలు వరి రైతులు సాగు చేశారన్నారు. తుఫాన్ ప్రభావంతో ఏ ఇబ్బందులు లేకుండా పొలాలను జాగ్రత్తగా చూసుకుని నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయాధికారి సూచించారు. ఆయన వెంట ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో వాగులు పొంగే సమయంలో వాహనదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వైవీ రమణయ్య అన్నారు. మండలంలోని దోర్నపువాగును ఆయన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. మండలంలో ప్రమాదకరంగా ప్రవహించే వాగు కావడంతో అక్కడ రెండు వైపులా పలువురు సిబ్బందిని పహారా పెట్టారు. వాగు ఉధృతి పెరిగితే ఎట్టి పరిస్థితుల్లో వాహనదారులను అనుమతించవద్దని సూచించారు. వాహనాలను దారి మళ్లించేందుకు అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని సూచించారు. ప్రధాన వాగులను గుర్తించి ఆయా మార్గాల్లో సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎస్‌ఐ మోహనరావు, సిబ్బంది ఉన్నారు.



తాళ్లూరు: మొక్కజొన్న రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ అబ్దుల్ రఫీక్



దోర్నపు వాగును పరిశీలిస్తున్న ఎస్‌ఐ వైవీ రమణయ్య

అసైన్డ్ రైతులకు వరం భూ హక్కు పథకం



రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
● రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ

మార్కాపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా అసైన్‌మెంట్ భూములు కలిగిన రైతుల ఇబ్బందులను తొలగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో అసైన్డ్ రైతులకు సంపూర్ణ భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. 2003 నుంచి అసైన్డ్ భూమి కలిగిన రైతులకు సంపూర్ణ హక్కు కల్పించిన ఘనత సీఎం జగనన్నదే అని అన్నారు. గతంలో అసైన్డ్ భూమి అంటే విలువ ఉండేది కాదని, భూహక్కు పథకంతో సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతోపాటు విక్రయించుకోవచ్చని చెప్పారు. మార్కాపురం నియోజకవర్గంలో ఈ పథకం కింద 1,210 మందికి చెందిన 2,264 ఎకరాల అసైన్డ్ భూమిని సెటిల్‌మెంట్ భూమిగా రెవెన్యూ అధికారులు మార్చి పూర్తి హక్కు పత్రాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కూడా వన్‌టైన్ సెటిల్‌మెంట్ గృహాలపై లోన్ తీసుకున్న యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు ఎంపీపీలు పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ బాపనరెడ్డి, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి తహసీల్దార్లు మంజునాథరెడ్డి, అబ్దుల్ హమీద్, షాజీదా, అశోక్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు పూర్తి స్థాయి ఆరోగ్య సేవలను అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ప్రదర్శించారు. అర్హులైన ప్రజలందరికీ లక్షలాది రూపాయల మేర వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చి వారి జీవనోపాధి మెరుగుపరిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, సర్పంచ్ సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



కోలభీమునిపాడులో హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

మార్కాపురం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక శాఖామంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రోశయ్య ఎంతో సేవ చేశారని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఎంపీపీ అరుణాచెంచిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి బి.శేషయ్య, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగేశ్వరరావు, కశ్శెట్టి నగేష్, డి.కరీముల్లా, కొత్త కృష్ణ, చంద్ర పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు

సంక్షేమ పథకాలే జగనన్నకు శ్రీరామ రక్ష

ముండ్లమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తాయని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని శింగనపాలెంలో సోమవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం సర్పంచ్ కందిమళ్ల గీతాంజలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాలంటే మనమందరం కలిసి కట్టుగా జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. పేదల పక్షాన నిలబడుతున్న జగనన్న లాంటి ముఖ్యమంత్రి మనకు దొరకడం అదృష్టమన్నారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ప్రజలకు చేకూరిన లబ్ధికి సంబంధించిన మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రావు, నరసింహారావు, భిక్షాలురెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లోని వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు కల్పించే సంక్షేమ పథకాలు వివరించాలని జేసీఎస్ కన్వీనర్ గుంటు పోలయ్య తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి పూర్తిగా తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి జగన్ కావాలనే విషయాన్ని ఇంటి వారితో క్షుణ్ణంగా 5 నిమిషాలు మాట్లాడి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేయాలన్నారు. రోజుకు 10 నుంచి 15 గృహాలు మాత్రమే సందర్శించి ప్రతి ఒక్కరినీ పేరు పేరున మనస్ఫూర్తిగా ప్రేమతో వివరాలు సేకరించాలని పోలయ్య తెలిపారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

విద్యార్థినులను జాగ్రత్తగా చూసుకోవాలి

రాచర్ల: విద్యార్థినులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీవో కె.కవితాచౌదరి అన్నారు. మండల కేంద్రం రాచర్ల కస్తూరిబా బాలికల పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ తీవ్రరూపంగా మారుతుందని, ఎక్కువగా చలితో పాటు తీవ్ర గాలులను దృష్టిలో పెట్టుకుని వసతి గృహాల్లో అప్పుడే వండిన వేడి వేడి ఆహారాన్ని వడ్డించాలని ఎస్‌వో మాలకొండమ్మను ఆదేశించారు. రాత్రి సమయాల్లో విద్యార్థినులు నిద్రించే గదులను అప్పుడప్పుడూ పర్యవేక్షించాలన్నారు. అనంతరం భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎంఈవో గిరిధర్‌శర్మ ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పార్వతి

బేస్తవారిపేట: ఏపీలో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమంలో ఆటల్లో పాల్గొనే వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ టి.పార్వతి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడేందుకు అవసరమైన అన్ని క్రీడా పరికరాలు అందిస్తారని, సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయివరకు టోర్నమెంట్ నిర్వహిస్తారని చెప్పారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి 15 ఏళ్ల నిండిన క్రీడాకారుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈఓపీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

● ఏడీఏ రమాదేవి సూచన

మార్కాపురం: తుఫాన్ నేపథ్యంలో పంటలు రక్షించుకునేందుకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మార్కాపురం సబ్‌డివిజన్ ఏడీఏ రమాదేవి సూచించారు. వరి గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉన్నట్లయితే వెంటనే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్, పాలిథిన్ పట్టలతో కప్పాలని తెలిపారు. వరి పనలు చేలో ఉంటే తక్షణమే కట్టలు కట్టి తడవకుండా చూసుకోవాలన్నారు. తడిచిన పనల్లో మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, మిరపలో వర్షం నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మూడో తీతకు సిద్ధంగా ఉన్న పత్తిని వెంటనే కూలీలతో తీయించి భద్రపరుచుకోవాలని ఏడీఏ స్పష్టం చేశారు.

డీప్ బోరును ప్రారంభించిన మంత్రి సురేష్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాలలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నీటి బోరును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని ఐనముక్కలలో జరిగిన కార్యక్రమంలో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరోగ్యమిత్ర దర్శనం రాంబాబు ఆదరణ కూడికలో మంత్రి పాల్గొన్నారు. మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, యక్కంటి మల్లారెడ్డి, యక్కంటి లింగారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

కొమరోలు: రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పటికీ ఉంటుందని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం అసైన్‌మెంట్ భూహక్కు పట్టాలను అర్హులైన రైతులకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ కామూరి అమూల్య, జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై మండలంలో 148 మంది లబ్ధిదారులకు 279.74 ఎకరాల విస్తీర్ణం గల భూహక్కు పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న ప్రతి రైతుకు అండగా నిలిచిందన్నారు. 20 సంవత్సరాలపాటు సాగులో ఉన్న అసైన్‌మెంట్ పట్టాలకు భూహక్కు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోనే కొమరోలు మండలంలో అధికంగా రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా 279 ఎకరాలు భూహక్కు పట్టాలుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. వెంకటనాయుడు మాట్లాడుతూ చంటి బిడ్డల నుంచి పండు ముదసలి వారి వరకు ప్రతి కుటుంబానికి నిజమైన లబ్ధిదారులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రంలో ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున ఎంపీపీ అమూల్య, వెంకటనాయుడు

అంబేడ్కర్ వర్ధంతిని జయప్రదం చేయాలి

దర్శి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జయప్రదం చేయాలని కోరుతూ తహశీల్దార్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కరపత్రాలు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో దళిత సేన నాయకులు విడుదల చేశారు. ఈ నెల 6వ తేదీన ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రేమ్‌కుమార్, మోషే పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాల



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న అధికారులు

దర్శి: ప్రపంచం ఉన్నంత వరకు తెలుగు గాయకులుగా ఘంటసాల వెంకటేశ్వరరావు మరచి పోలేని అమర గాయకునిగా ఉంటారని తహశీల్దార్ వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని సంఘ సేవకుడు జీవీ రత్నం అధ్యక్షతన సోమవారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తహశీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఘంటసాల ఆలపించిన గీతాల రూపంలో నేటికీ ఆయన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని చెప్పారు. డీటీ రవిశంకర్, ప్రేమ్‌కుమార్, దేవప్రసాద్, మోషే, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మాటలన్నీ అవాస్తవాలే..



మాట్లాడుతున్న కౌన్సిలర్ హర్షిత

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని 16వ బ్లాక్‌లో కొన్ని కుటుంబాలు వైఎస్సార్ సీపీని వీడాయని టీడీపీ నేతలు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత విమర్శించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ.. భవిష్యత్తుకు బాబు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 16వ బ్లాక్‌లో 40 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు కండువాలు కప్పారని, సొంత పార్టీ నేతలను ఆహ్వానించడం వారికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి చర్యలతోనే ప్రజల్లో టీడీపీ చులకన అయిందని, వాస్తవ పరిస్థితి ఏమిటో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు.

రేపు కొత్తూరులో రామాలయం పునఃప్రతిష్ఠ ఉత్సవం

పొదిలి: స్థానిక విశ్వనాథపురం(కొత్తూరు)లో సీతారామచంద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, విమాన శిఖర, ధ్వజ స్తంభ, కుంభాభిషేక మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయం వద్ద సోమవారం నుంచి హోమాలు, పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు విగ్రహాల పునఃప్రతిష్ఠ, 11 గంటలకు గ్రామ సమారాధన, సాయంత్రం శాంతి కళ్యాణం నిర్వహించనున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



దర్శనం కోసం క్యూలో నిలబడిన భక్తులు



త్రిపురాంతకేశ్వరస్వామి అభిషేకానికి హాజరైన భక్తులు



ప్రత్యేక అలంకారంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

రాచర్ల: మండలంలోని రామాపురం, అక్కపల్లె గ్రామాల సమీపంలో ఉన్న శ్రీ సిద్ధిభైరవేశ్వర, కనక సురభేశ్వర, సత్యవోలులోని రామాలింగేశ్వర దేవస్థానాల్లో కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామాపురంలోని సిద్ధిభైరవేశ్వర స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవస్థానంలో మహిళలు భారీ ఎత్తున చేరి కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అవరణలో ఉన్న విశిష్టత గత శివలింగానికి భక్తులు పాలాభిషేకాలు చేశారు. దేవస్థానం అవరణలో మహిళలు, అయ్యప్పమాలధారులు భజనలు చేశారు. భక్తులకు రామాపురం గ్రామానికి చెందిన ఎల్.సాయిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దేవస్థానం ధర్మకర్త మదిరె శ్రీరంగారెడ్డి అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: కార్తీక సోమవారం సందర్భంగా శ్రీపర్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, శ్రీబాలా త్రిపురసుందరీదేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాల్లో స్వామి అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు ప్రసాదశర్మలు నిర్వహించారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి కార్తీక మాసోత్సవాలకు వచ్చే భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆలయాల వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.



మార్కండేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. మార్కండేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ, శ్రీధర్ శర్మ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ కేశవశర్మ, సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

■ **తర్లుపాడు:** తర్లుపాడులోని శివాలయం, కేతగుడిపిలోని కేదారేశ్వరస్వామి ఆలయం, నాగెళ్లముడుపు శివాలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకాలు, ఈశ్వర వ్రతాలు నిర్వహించారు. రాము శర్మ, రాఘవశర్మ, ప్రసాద్‌శర్మ, పవన్ శర్మ ఆధ్వర్యంలో ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.



కేతగుడిపి కేదారేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు